


# ముఖతిప్పలు






- మొరాయిస్తున్న యాప్
- పోషకాహారం పంపిణీలో సాంకేతిక సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు
- లబ్ధిదారులకు సైతం తప్పని కష్టాలు

బాల సంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌ల మొరాయింపుతో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పోషకాహారం పంపిణీలో ముఖ ఆధారిత గుర్తింపుతో ముప్పతిప్పలు పడుతున్నారు. లబ్ధిదారులకు ప్రతినెలా బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, గుడ్లు, రాగిపిండి, అటుకులు, బెల్లం, పప్పుచెక్క ఖర్జూరం అందిస్తోంది. వీటిని రెండు విడతలుగా అందించడంతో రెండుసార్లు ముఖఆధారిత గుర్తింపును అంగన్‌వాడీ కార్యకర్తలు నమోదు చేసుకోవాల్సి ఉంది. దీంతో ఒక్కో లబ్ధిదారుల వద్ద రెండు, మూడు రోజులు దాకా సమయం పడుతుంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నంద్యాల రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సరఫరా చేసే ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం జూలై నుంచి ముఖ ఆధారిత గుర్తింపు తప్పనిసరి చేసింది. సాంకేతిక సమస్యలు ఉండటంతో ముఖ ఆధారిత గుర్తింపు చాలా ఇబ్బందిగా మారింది. సాంకేతిక సమస్యలు రావడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, బాలింతలకు చేసే పోషకాహారం సరఫరాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు గతేడాది రాష్ట్రప్రభుత్వం బాల సంజీవని, కేంద్ర ప్రభుత్వం పోషణ ట్రాకర్ యాప్‌లను తీసుకొచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రంలో గాని ఇంటికెళ్లి గాని లబ్ధిదారులకు సరకులు సరఫరా చేయాలంటే ఈ యాప్‌లో లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపును నమోదు చేయాలి.

### నెలాఖరి వరకు పంపిణీ చేస్తున్నాం

ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రతినెలా బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, గుడ్లు, రాగిపిండి, అటుకులు, బెల్లం, పప్పుచెక్క, ఖర్జూరం అందిస్తోంది. వీటిని రెండు విడతలుగా అందించడంతో రెండుసార్లు లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపును నమోదు చేసుకోవాల్సి వస్తుంది. ఒక్కో విడతకు ఒక్కొక్క లబ్ధిదారుడు గంటలు తరబడి వేచి చూడాల్సి వస్తుంది. కొన్నిసార్లు 2, 3 రోజులు తిరగాల్సిన పరిస్థితి వస్తుంది. రెండు విడతలకు కలిసి కొందరూ 5, 6 తిరగాల్సి వస్తోంది. నెలాఖరి వరకు సరకులు పంపిణీ చేయాల్సి వస్తోందని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. రెండు విడతలకు ఒకేసారి ముఖ ఆధారిత గుర్తింపును నమోదు చేసుకునేలా ఉంటే సమస్య కొంత మేరకు తగ్గుతుందన్నారు.


ముఖ ఆధారిత గుర్తింపు కోసం గంటల తరబడి వేచి ఉన్న గర్భిణులు

**నంద్యాల జిల్లాలో**

| | గర్భిణులు | బాలింతలు | 7 నెలల- 3 ఏళ్ల బాలలు | 3 ఏళ్ల - 6 ఏళ్ల బాలలు | అంగన్‌వాడీ కేంద్రాలు |
|---|---|---|---|---|---|
| నంద్యాల జిల్లాలో | 11630 | 9116 | 58464 | 26978 | 1663 |
| నంద్యాల అర్బన్ | 2372 | 1814 | 12364 | 4143 | 295 |

### రోజుల తరబడి తిరుగుతున్నాం



బాల సంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌ల మొరాయింపుతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉదయం 8గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ముఖ ఆధారిత గుర్తింపును నమోదు చేసుకుంటున్నాం. అందరికీ సరుకులు అందించేందుకు మరుసటి మాసం వస్తుంది. ఒక్కొక్క ఇంటి వద్ద గంటల సమయం పడుతుంది. కొందరి దగ్గరకు రోజుల తరబడి తిరుగుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి.

- సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్త, సంగంపేట, నంద్యాల

### సమస్య పరిష్కరించండి




ఈ యాప్‌ల మొరాయింపుతో అవస్థలు పడుతున్నాం. గంటల తరబడి కూర్చొని ఉండాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లు రెండు, మూడ్రోజులు పడుతుంది. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- వరలక్ష్మి, గర్భిణి, పింజరిపేట, నంద్యాల

## అంధత్వాన్ని అధిగమించి..!

- బ్రెయిలీ లిపిలో భగవద్గీత...!
- అంధత్వంలోనూ అష్టావధానంలో దిట్ట
- గీతా శ్లోకాలను అవపోసిన పట్టిన పండితుడు
- సొంతూరిలో బ్రెయిలీ భగవద్గీత ఆలయ నిర్మాణం
- అంధుల చక్రవర్తిగా రాణిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న



బీటీ లక్ష్మన్న... పుట్టుకతోనే మసకబారిన కంటి చూపుతో బడి బాట పట్టాడు ఆయన. చీకటిలోనే చదువును సాగించాడు. దృష్టిలోపం ఉన్నా.. దాన్ని గుర్తించే స్థాయిలో తల్లిదండ్రులు లేకపోవడం ఒకవైపు.. కంటి చూపు సరిదిద్దుకోవాలన్న అవగాహన లేని బాల్యం మరోవైపు ఆయన్ను అలాగే పదో తరగతి వరకు నడిపించాయి. దీపం వెలుగులో దృష్టి సరిగ్గా లేక, కష్టపడి పది పరీక్షలు రాసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే దృష్టి పూర్తిగా కోల్పోయిన ఆయన అంధుల పాఠశాల్లో చేరి, పది, ఇంటర్ ఉత్తీర్ణుడై, టీటీసీ రాసి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించారు. ఆ తర్వాత అంధత్వం తన ఆశయాలకు అడ్డుకాకూడదని తలంచాడు. బ్రెయిలీ లిపిలో భగవద్గీత రాసి, లక్షలాది మంది అంధులకు గీతా సారాంశాన్ని తన పుస్తకం ద్వారా అందించాడు. అలాగే గీతలోని శ్లోకాలను అవపోసన పట్టి అంధత్వంలోనూ అష్టావధానాల్లో దిట్టగా నిలిచాడు. తన తండ్రి స్మారకార్థం స్వగ్రామంలో 'బ్రెయిలీ భగవద్గీత ఆలయం' నిర్మించి, అందులో గోమాత సమేత శ్రీకృష్ణ భగవానుడు, రాధాదేవిని ప్రతిష్ఠించాడు. సంకల్పబలం గట్టిగా ఉంటే అసాధ్యాలు సుసాధ్యాలుగా మలుచుకోవచ్చని నిరూపించాడు. ఇలా బహుముఖ రూపాల్లో రాణిస్తున్న ఆయనే ఆలూరు మండల కేంద్రానికి చెందిన బీటీ లక్ష్మన్న. ఆలూరు మండలం, హులేబీడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన కళ్లు ఉండి కూడా అవకాశాలు లేవని, రాలేదని నిరాశ నిస్పృహలతో ఉండే ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

వివరాలు 6వ పేజీలో

### మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు లేకుండా నేరుగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జే.సురేష్ శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 87126 25080 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### నవోదయలో 9,11వ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9,11వ తరగతులకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2026-27వ విద్యాసంవత్సరానికి డ్రాపౌట్స్ సీట్ల స్థానంలో ఇతర విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సెప్టెంబరు 29 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేస్తుకున్న వారికి వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడోతేదీన ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. 01.06.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. వివరాలకు విద్యాసంస్థ పనివేళల్లో 08512-294545 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

### సాగునీటిలో రాష్ట్రానికి అన్యాయం

**బొజ్జా దశరథరామిరెడ్డి**



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సాగునీటి హక్కులపై ప్రభుత్వాల ఉదాసీనత వైఖరి వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం కేసీ కెనాల్ నీటి వాటాపై వినిపిస్తున్న వాదనలపై శనివారం బొజ్జా స్పందిస్తూ కీలక అంశాలను ప్రస్తావించారు. కేసీ కెనాల్‌కు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 39.9 టీఎంసీల నీటివాటాను 18.5 టీఎంసీలకు తగ్గించి ఆదా అయిన నీటిని తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు వాదిస్తోందన్నారు. ఇది కేవలం కేసీ కెనాల్ నీటి హక్కులను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నమే కాదని, ఇలాంటి వాదనలనే అన్ని ప్రాజెక్టుల మీద తెలంగాణ ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ ప్రకారం ట్రిబ్యునల్ నీటి వాటాలను కేటాయిస్తే రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులు స్మారక చిహ్నాలుగా మిగిలి ఎడారి ప్రాంతంగా మారే ప్రమాదం ఉందన్నారు మన నీటి హక్కులపై ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా దృష్టిసారించాలని, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవించి కొత్త టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.

### మరో గేటు ఎత్తివేత
#### వెలుగోడు నుంచి దిగువకు నీటి విడుదల

వెలుగోడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ జలాశయం నుంచి అధికారులు శనివారం మరో గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మొత్తం నాలుగు స్పిల్‌వే గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కుల నీటిని గాలేరు నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి బనకచర్ల సముదాయం నుంచి 12వేల క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి మెయిన్ కెనాల్ ద్వారా 5వేలు, స్పిల్‌వే ద్వారా 8వేలు, కుడి తూము ద్వారా 60, ఎడమ తూము ద్వారా 30, నంద్యాల తాగునీటి కోసం 20 క్యూసెక్కుల చొప్పున మొత్తం 13,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 264.70 మీటర్ల వద్ద 15.234 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలుగుగంగ అధికారులు తెలిపారు.


స్పిల్‌వే గేటు నుంచి ప్రవహిస్తున్న నీరు

### మెరుగైన విద్యను అందించండి

- పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచండి
- కలెక్టర్ రాజకుమారి


విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఆళ్లగడ్డ, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శనివారం పట్టణంలోని పడకండ్ల గ్రామ సమీపంలో ఉన్న మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆదర్శ పాఠశాలంటే ప్రతి అంశంలో ఏ గ్రేడ్‌లో ఉండాలన్నారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక నుంచి పాఠశాలను తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, పరిసరాలు శుభ్రంగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట కమిషనర్ కిషోర్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ప్రిన్సిపాల్ గుర్రప్ప తదితరులు ఉన్నారు.

గిరిజన పాఠశాల విద్యార్థులకు అస్వస్థత
7



## పాటిస్తారా..?




- ప్రైవేట్ ఆసుపత్రుల కట్టడికి ప్రభుత్వం చర్యలు
- ప్రతి ఆసుపత్రిలోనూ ఫీజుల పట్టిక
- స్కానింగ్, ల్యాబ్‌ల్లోనూ ఇదే నిబంధన
- వైద్యఆరోగ్యశాఖ తాజా ఉత్తర్వులతో అలజడి
- ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో

నంద్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ చూసినా ఇష్టారాజ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్, తదితర ల్యాబ్ నిర్ధారణ పరీక్షల కేంద్రాలు వెలిశాయి. వైద్యఆరోగ్యశాఖ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా వైద్యం కోసం ప్రజలను వైద్యచికిత్సల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులు దోపిడీ చేస్తున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన జిల్లా యంత్రాంగం సైతం మిన్నకుండిపోయింది. దీంతో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా వైద్యం పేరుతో జబ్బుతో వచ్చిన ప్రజలను నిలువునా దోచేస్తున్నారు. పైగా ఇప్పటికే జిల్లాలో సీజనల్ వ్యాధులు కూడా మొదలయ్యాయి. చిన్నపాటి జర్వంతో వచ్చిన కూడా వివిధ పరీక్షల పేరుతో వేళల్లో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం వెళ్లే వారికి దోహదపడే విధంగా చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో తాజాగా వైద్యఆరోగ్యశాఖ ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్, ల్యాబ్‌ల్లో సైతం వైద్య సేవల ఫీజుల వివరాలతో కూడిన పట్టిక ప్రదర్శించాలని తాజాగా జిల్లా యంత్రాంగానికి ఉత్తర్వులు జారీ చేసింది. రోగులకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా వైద్య సేవల ఫీజుల పట్టికను నోటీసు బోర్డులో తప్పకుండా వెంటనే ఏర్పాటు చేసే విధంగా చూడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పట్టికను ఫొటో తీసి జిల్లా వైద్యఆరోగ్యశాఖకు పంపాలని ఆదేశించారు. దీంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు సైతం ఆ దిశగా ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు.

నంద్యాల జిల్లాలో అధికారికంగా 110 ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు ఉన్నట్లు వైద్యశాఖ వెల్లడించింది. అదేవిధంగా 27 పాలీక్లినిక్‌లు, 125 స్కానింగ్ సెంటర్లు, 8 ల్యాబ్(డయాగ్నస్టిక్ సెంటర్లు) ఉన్నాయి. ఇక అనధికారికంగా కూడా పదుల సంఖ్యలోనే ఉన్నాయి. అధికంగా ప్రైవేట్ వైద్యశాలలు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా సేవలందిస్తున్నారు. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కనీసం ఓపీ ఎంత.. ఏ పరీక్షకు ఎంత..? అడ్మిన్ తరువాత బెడ్ చార్జీలు, స్కానింగ్, పరీక్షలకు ఎంత తీసుకుంటారు వంటి వైద్యసేవలకు సంబంధించిన వివరాలను ఎక్కడా తెలపడం లేదు. ఆసుపత్రికి వెళ్లాక సిబ్బంది ఎంత చెబితే అంత కట్టాల్సిందే. కనీసం ఆయా వాటిలో ధరల పట్టికను ఏర్పాటు చేస్తే.. కొంత వరకైనా ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్, ల్యాబ్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా దోపిడీకి అడ్డుకట్ట పడే అవకాశం లేకపోలేదు. ధరల పట్టిక ప్రదర్శించాలని నిబంధన ఉన్నా.. కూడా చాలా వాటిలో ప్రదర్శించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



### ఇష్టారాజ్యంగా దోపిడీ

జిల్లాలో కొందరు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు వైద్యం పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారు. కొందరైతే మరీ దారుణం. ఏదైనా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లి.. ఓపీ తీసుకుంటే రూ.300, మరీ అత్యావసరమైతే రూ.500 చొప్పున కొందరు ప్రైవేట్ ఆసుపత్రులు వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారం కూడా నిత్యం జిల్లా ఉన్నతాధికారులు, ఆశాఖ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఉండే నంద్యాల పట్టణంలోనే కొనసాగుతుండటం గమనార్హం. ఇక జ్వరాలు, చిన్నపాటి అనారోగ్య సమస్యలతో వెళ్లినా కూడా ఓపీ, ఐపీ, స్కానింగ్, వివిధ పరీక్షల పేరుతో ప్రజలపై పెనుభారం మోపుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే అధికారుల నిర్లక్ష్యం కాస్తా.. ప్రైవేట్ ఆసుపత్రులకు వరంగా మారింది.

### నిబంధనలు పాటించాల్సిందే




వైద్యఆరోగ్యశాఖ నిబంధనలను ప్రతి ప్రైవేట్ నిర్వాహకులు తప్పకుండా పాటించాలి. ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, స్కానింగ్ తదితర ల్యాబ్‌ల నిర్వాహకులు వెంటనే ఫీజుల పట్టికను అమర్చాలి. ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలి. ఎక్కడైనా ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటాం. తాజా ఉత్తర్వులపై ఆరా తీస్తూ ఆయా నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నాం.

- వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

తుంగభద్ర తీరం

# సాహిత్యం

## కందనవోలు శాపగ్రస్తులు



కర్నూలు కల్చరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రైతుల దీనస్థితిని 'శాపగ్రస్తులు' కథా సంపుటి ద్వారా జిల్లా రచయితల బృందం చాలా చక్కగా వివరించింది. రైతే రాజు, రైతు లేనిదే రాజ్యమే లేదు. దేశానికి రైతు వెన్నెముక, అన్నదాత అనే మాటలు రైతులను పొగిడేందుకు బాగుంటాయి.. కానీ కరువు ప్రాంతమైన కర్నూలులో రైతుల పరిస్థితి వేరుగా ఉంది. ఈ పుస్తకంలో రైతుల కష్టాలు, బాధలు వారి జీవన పరిస్థితులు వారి పోరాటలు, అనుభవాల గురించి తెలుపుతుంది. వర్షాలు పడక, పంటలు పండక చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే రైతులు దీనస్థితిని హృదయ విదారకంగా వివరించింది. 'ప్రాజెక్టు 1960' కథలో 'భూమమ్మను నమ్ముకున్న వాడెవడు సెడడనీ మా జేజమ్మంటుండే ఇప్పుడేమో భూమిని నమ్మినోడే సెడిపోతున్నాడు' అనే మాటలు ఆలోచనలో పడేస్తాయి. నాలుగు సంవత్సరాల్లో పూర్తి కావలసిన ప్రాజెక్టు నలభై ఏళ్లు కావడానికి కారణం ప్రభుత్వమా? ప్రజాప్రతినిధులా? అని రచయిత మనల్ని ప్రశ్నిస్తాడు. 'శాపగ్రస్తులు' అనే కథలో వానలు పడక, పంటలు పండక, వడ్డీలోళ్లకు ముఖం చూపించలేక నలిగి రైతుల ఆత్మహత్యలు చేసుకున్న తీరును చూస్తే ఏడుపు రాక మానదు. 'బాలింగన్న బతుకుబండి' అనే కథలో పశువులకు మేతలేక ఆ పశువులను అమ్ముకునేటప్పుడు చిన్న పిల్లాడికి మల్లే ఏడ్చిన లింగన్న అల్లుడి తీరు ఆవేదనను కలిగిస్తుంది. పశువులను తమ కుటుంబ సభ్యులుగా భావించిన తీరు కనపడుతుంది. రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అమ్మే వ్యాపారుల గురించి కూడా రచయిత చక్కగా వర్ణించాడు. 'కరువు కాటు' అనే కథలో పంట పెట్టుబడుల కోసం పశువులు, మేకలను అమ్ముకోవడం చివరకు ఆ పంట పండక పోయేసరికి ఉన్న ఊరిని విడిచి వలస వెళ్లిపోవడం గురించి వివరించారు. వలస వెళ్లిన కుటుంబాల మనుషులు చనిపోతే తమ వారిని కడసారి చూపునకు కూడా నోచుకోలేని వంటి విషయాలు హృదయ విదారకంగా ఉంటాయి.

నారాయణ అనే రైతు పంటల దిగుబడి ఎక్కువగా రావడం కోసం నకిలీ ఎరువులు, నకిలీ పురుగుమందులు వాడి నష్టపోయి అప్పు కట్టలేక చివరికి ప్రాణాలు తీసుకునే దాకా వచ్చిన స్థితిని వివరించారు. గొప్ప ఆత్మస్థైర్యం గల రైతు పిరికివాడిగా మారి ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో ఈ కథ వివరిస్తుంది. 'అలనాటి కరువు' అనే కథలో బ్రిటీష్ వారి హయాంలో వచ్చిన పెద్ద కరువుకు మనుషులను సాటి మనుషులే ఆకలికి తట్టుకోలేక తినేయడం, ఆకలికి అలమటించి కడుపున పుట్టిన పిల్లలను అమ్ముకొని పొట్టనింపుకున్న తీరును కరువు రక్కసిని చిత్రించారు. కందనవోలు గుండెల మీద ప్రవహించే తుంగభద్ర, కృష్ణ నీళ్లు మాత్రమే చాలు.. మనకు రాయలసీమను రతనాల సీమగా, సస్యశ్యామల సీమగా మర్చవచ్చు. తుంగభద్ర దిగువ కాలువ, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, కేసీ కెనాల్, హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ కాలువల ద్వారానే కాకుండా వేదవతి, రాజోలిబండ డైవర్షన్ కుడి కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టు కూడా పూర్తయితే పశ్చిమ కర్నూలు ప్రాంత ప్రజలు కూడా ఏ ఊరికి వలసవెళ్లి పోకుండా ఇక్కడే సంపన్నులు అవుతారన్నది కర్నూలు జిల్లా రచయితల బృందం 'శాపగ్రస్తులు' రచనలో వివరించింది.



- మానుకింది వెంకటేష్
తెలుగు ఉపాధ్యాయుడు, ఆదోని

## నేడు టీజీవీ కళాక్షేత్రంలో 'వర్క్ ఫ్రమ్ హోమ్' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెలా చివరి ఆదివారం సాంఘిక నాటక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా ద్రోణాదులకు చెందిన కళాకారులు డి.మహేంద్ర దర్శకత్వంలో ఈ నాటకం ప్రదర్శిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నాటక ప్రదర్శనకు ముందు షాద్‌నగర్ బాలికలు టీవీ రంగయ్య దర్శకత్వం 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అనే లఘు నాటిక ప్రదర్శిస్తారని, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ అంధ అష్టావధాని, ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న భగవద్గీతపై అవధానం చేస్తున్న సందర్భంగా సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# కళా రమణుడు..!

- నాలుగు దశాబ్దాలుగా నాటక రంగంలో సుదీర్ఘ ప్రస్థానం
- టీజీవీ కల్చరల్ అకాడమీ ద్వారా నేటికీ ప్రదర్శనలు

కళ



శ్రీకృష్ణ భీమసేనమ్‌లో శకుని పాత్రలో రమణారెడ్డి

కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి యుద్ధం నాటకంలో తన తండ్రి వంగూరు రామిరెడ్డి కంఠం సర్దుకొని పద్యాలాపన చేస్తుంటే ఆ పిల్లవాడు అలా కళ్లప్పగించుకొని చూస్తూ ఉండిపోయాడు. చింతామణి నాటకంలో తండ్రి బిల్వ మంగళుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లు నటిస్తుంటే ఆ కుర్రాడు ఆ పాత్రలో లీనమై పోయాడు. ఒకటి కాదు, రెండు కాదు.. తండ్రి ఏ పాత్ర ధరించినా దానికి తగ్గ గాత్రం, పద్యాలాపన, గంభీరమైన ముఖ వర్చస్సు, అందుకు తగిన ఆహార్యంతో అశేష ప్రేక్షకాభిమానుల్ని సంపాదించుకున్నాడు. తండ్రి స్ఫూర్తితో ఎదిగిన తనయుడు కూడా నాటకం రంగం అంటేనే ప్రత్యేక అభిమానం, ఆసక్తి, అభిరుచితో తన పంతొమ్మిదేళ్ల ప్రాయంలోనే నాటక రంగంలో ప్రవేశించాడు. నాలుగు దశాబ్దాలుగా పౌరాణిక పద్య నాటక రంగ ఖ్యాతిని తన నాటకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చాటి చెబుతున్నారు. ఆయనే కర్నూలు మండలం దిగువపాడుకు చెందిన వంగూరు వెంకట రమణారెడ్డి (వీవీ రమణారెడ్డి). టీజీవీ కల్చరల్ అకాడమీ సంస్థ ద్వారా నేటికీ తన 66 ఏళ్ల ప్రాయంలోనూ తరగని ఉత్సాహంతో అనేక నాటక పరిషత్తుల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే నంది నాటక పోటీలలో నంది పురస్కారాలతోపాటూ తిరుపతి, ఒంగోలు, విజయవాడ, హైదరాబాదుల్లోని కళాపరిషత్తులలో జాతీయ పురస్కారాలు సొంతం చేసుకున్నారు.

దిగువపాడుకు చెందిన వీవీ రమణారెడ్డిది వ్యవసాయ కుటుంబం. తండ్రి వంగూరు రామిరెడ్డి రామాయణ భాగవతాదుల్ని చదివారు. తండ్రి ప్రోత్సాహంతో ఇంటర్ చదువు పూర్తయ్యాక తన 19వ ఏట శ్రీరాముని వేషం కట్టారు రమణారెడ్డి. తండ్రి దగ్గరే పాత్రల్లో నటించడం, పద్యాలు ఎలా పాడాలో నేర్చుకున్నారు. పొగాకు వ్యాపారం రీత్యా ఆయన గ్రామం నుంచి కర్నూలుకు మకాం మార్చాల్సి వచ్చింది. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసుకుంటూనే సాయంత్రం నగరంలోని లలిత కళా సమితికి వెళ్లేవారు. అక్కడ నాటి అధ్యక్షుడు థామస్‌రెడ్డి సమితిలో సభ్యత్వం తీసుకుని, నటుడిగా నాటకంలో వేషం వేయాలని ఒత్తిడి చేశారు. 1994లో అలా రూ.116 సభ్యత్వం చెల్లించి, వారు ప్రదర్శిస్తున్న 'నర నారాయణ' నాటకంలో నరుడి పాత్ర వేశారు. ఇది నంది పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా నంది బహుమతి సాధించింది. ఆ తర్వాత వరుసగా 'శ్రీకృష్ణాభిమన్యు'లో అభిమన్యుడిగా, 'మరో ప్రస్థానం' సాంఘిక నాటకంలో విలన్ పాత్రగా నటించారు. తర్వాత స్వీయ దర్శకత్వంలో 'మహారథి కర్ణ'లో కర్ణుడిగా నటించారు. ఇది వివిధ పరిషత్తుల్లో బహుమతులు సాధించింది. తర్వాత తిరుమల వేంకటేశ్వర స్వామిపై రూపొందించిన పౌరాణిక, పద్య నాటకం 'ఆనంద నిలయం' మంచి పేరు తీసుకువచ్చింది. ఇందులో రమణారెడ్డి నటించిన తొండమాన్ చక్రవర్తి పాత్రకు ప్రత్యేక గుర్తింపు లభించింది.



ఆనంద నిలయం నాటకంలో భక్తుడిగా రమణారెడ్డి



నంది అవార్డు సాధించిన రమణారెడ్డి నాటక బృందాన్ని అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

టీజీవీ కల్చరల్ అకాడమీ నాటక సంస్థను స్థాపించి, ఆ సంస్థ ద్వారా ఏటా నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు వీవీ రమణారెడ్డి. స్వయంగా దర్శకుడైన ఆయన పద్య నాటకాల స్క్రిప్టులను సిద్ధం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా అనేక పరిషత్తుల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. అలా శ్రీ వేంకటేశ్వర మహత్యం, ఆనంద నిలయం, శ్రీకృష్ణ భీమసేనమ్ వంటి నాటకాలను ప్రదర్శించి బహుమతులు సాధించారు. ఈనెల 26న తిరుపతి అభినయ ఆర్ట్స్ సంస్థ ప్రకటించిన 'హనుమ అవార్డు'లకు శ్రీ వేంకటేశ్వర మహత్యం అనే నాటకం తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నారు. అలాగే పేద వర్గాలకు చెందిన కళాకారులను గుర్తించి ఏటా సత్కరిస్తున్నారు. హార్మోనిస్టు గురువులను గుర్తించి వారికి తమ సంస్థ ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

## మస్టర్ల మాయాజాలానికి చెక్

- ఉదయం, సాయంత్రం హాజరు నమోదు
- వీటి ఆధారంగానే వేతనాలు చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో మస్టర్ల(హాజరు) మాయాజాలానికి ఇక చెక్ పడనుంది. గతంలో మాదిరిగా ఫొటో తీసి పని చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయే పరిస్థితులుండవు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న జాబ్ కార్డులు ఉన్న శ్రామికులు (కూలీలు) ఇకపై ఉదయం, సాయంత్రం మస్టరు నమోదు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల క్రితం నీటి యాజమాన్య సంస్థ జిల్లా కార్యాలయానికి ఈ ఉత్తర్వులు అందాయి. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం పని ప్రదేశాల్లో పని చేస్తున్న వారి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలి. ఆయా మస్టర్ల ఆధారంగా వారికి వేతన చెల్లింపులు చేయనున్నారు. అక్రమాలను నివారించడమే లక్ష్యంగా కేంద్రం ఈ విధానం అమలులోకి తెచ్చింది.



### అలసత్వం వహిస్తే చర్యలు

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు సంబంధించి ఇకపై ఉదయం, సాయంత్రం వారి ఫొటోలను తీసి యాప్‌లో పంపాల్సి ఉంటుంది. ఎవరైనా అలసత్వం వహిస్తే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవు. ఈ ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

● వెంకటరమణ,
పీడీ, నీటి యాజమాన్య సంస్థ, కర్నూలు

## పాలకొలను సర్పంచ్‌కు అరుదైన గౌరవం

### ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం



చదువుల సుజాతమ్మ

ఓర్వకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలంలోని పాలకొలను సర్పంచ్ చదువుల సుజాతమ్మకు అరుదైన గౌరవం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ శనివారం అధికారికంగా వెల్లడించినట్లు పాలకొలను పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రంలో పది మందిని ఎంపిక చేయగా.. వారిలో కర్నూలు జిల్లా నుంచి సర్పంచ్ చదువుల సుజాతమ్మ ఎంపికయ్యారు. సర్పంచ్ సుజాతమ్మ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలు, పారిశుధ్యం తదితర విభాగాల్లో కృషి చేయడంతోనే ఈ అవకాశం దక్కిందన్నారు. ఇంత గొప్ప అవకాశం లభించడంలో మండల, గ్రామ అధికారులు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజల సహకారం కారణం అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కినందుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మహానందిలో రాష్ట్ర హైవేస్ ఎస్ఈ పూజలు

మహానంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాష్ట్ర హైవేస్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయం ముఖద్వారం వద్ద ఏఈవో యర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఈ ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు చేశారు. వేద ఆశీర్వచన మంటపంలో వేదపండితులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కర్నూలు ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.



శ్రీనివాస రెడ్డిని సన్మాని స్తున్న వేద పండితులు

# అంధత్వాన్ని అధిగమించి..!

కళ్లు కనిపించని వారికి, అంధత్వాన్ని అడ్డుగా భావించే వారికి హుళేబీడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న అభినవ బ్రెయిలీ అయ్యారు. కేవలం స్పర్శతోనే అక్షరాలను గుర్తుపట్టి అంధులకు భగవద్గీతను తెలుసుకునేలా చేస్తున్నారు ఆయన. జీవితంలో ఎన్నో కష్టాలను, ఒడిదుడుకులను ఎదుర్కొని ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. ఎవరూ చేయని సాహసం చేసి బ్రెయిలీ లిపిలో భగవద్గీతను లిఖించి చీకటిని జయించారు. అక్షరాలను చుక్కల కూర్పుతో అంధులు గుర్తుపట్టేలా ఆయన రాసిన బ్రెయిలీ లిపిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

- కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి)



కుమార్తెలు రాజేశ్వరి, యోగేశ్వరితో బీటీ లక్ష్మన్న

### బాల్యం.. విద్యా జీవితం.. ఉద్యోగ ప్రస్థానం

ఆలూరు మండల కేంద్రానికి చెందిన నర్సమ్మ, హనుమన్న దంపతులకు రెండో సంతానంగా బీటీ లక్ష్మన్న 1971 జూన్ 1న జన్మించారు. వ్యవసాయ ఆధారిత కుటుంబంలో పుట్టిన లక్ష్మన్న ప్రాథమిక విద్య ఆలూరులోని ఆది ఆంధ్ర పాఠశాల్లో సాగింది. అప్పటికే 20 శాతం దృష్టిలోపం ఉన్నా, దాన్ని తల్లిదండ్రులు గుర్తించలేదు. తాను కూడా కనిపించే ప్రపంచం ఇలాగే ఉంటుందన్న భావంతో ఉండిపోయాడు. 1985లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో పది పరీక్షలు రాశాడు. అప్పటికే దృష్టిలోపం బాగా పెరిగిపోయింది. ఇంట్లో దీపం వెలుగులోనే చదువుకోవాల్సి వచ్చేది. అలా తన అంధత్వానికి చిమ్మ చీకటి మరింత చూపు కోల్పోయేలా చేసింది. దీంతో పది పరీక్ష ఉత్తీర్ణత కాలేకపోయారు. దీంతో దిగులుతో ఉన్న ఆయన్ని పాఠశాల సంగీతం మాస్టారు సుబ్బరాయుడు హైదరాబాదులోని అంధుల పాఠశాలలో చేరమని సలహా ఇచ్చారు. అలా 1987లో పది ఉత్తీర్ణత సాధించి, 1988లో అక్కడి చంచలగూడ జూనియర్ కళాశాల్లో ఇంటర్ విద్య పూర్తి చేశారు. 1990-91లో నేరేడుమెట్ట ప్రభుత్వ టీటీసీ కళాశాల్లో సీటు సాధించి, టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేశారు. 1992లో హైదరాబాదులోనే బ్రెయిలీలో డిప్లమో పాసయ్యారు. 1993లో ఉపాధ్యాయునిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ఆలూరు మండలం, మానసపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల్లో విధుల్లో చేరారు.



గతేడాది ఆగస్టు 25న ఆలూరు న్యాయాధికారి హేమ చేతుల మీదుగా బ్రెయిలీ లిపి భగవద్గీత ఆవిష్కరణ

### ఐదేళ్లు కష్టపడి బ్రెయిలీ లిపిలో భగవద్గీత

దృష్టిలోపం నుంచి పూర్తి అంధత్వం వచ్చాక బీటీ లక్ష్మన్న కుమిలిపోలేదు. పైగా తనలోని సామర్థ్యాలకు సానపట్టి, అసాధ్యాలను సుసాధ్యం చేయాలని బలంగా సంకల్పించుకున్నాడు. ప్రతిభకు కొలమానాలు ఏవీ లేవని నిరూపించాలని భావించాడు. తనకు ఇష్టమైన దేవుడు కృష్ణభగవానుడిని నిత్యం ఆరాధించే బీటీ లక్ష్మన్నకు ఒకరోజు కలలో కృష్ణభగవానుడే స్వయంగా వచ్చి తన భగవద్గీతను అంధులకు కూడా అర్థం అయ్యేలా రాయాలని బోధించాడని ఆయన చెబుతుంటారు. దీంతో బాగా ఆలోచించి ఇప్పటి వరకు ఎవరూ చేయని ఈ ప్రయత్నాన్ని తాను ఎందుకు చేయకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1995లో ఆలూరు జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న తెలుగు అధ్యాపకుడు వరప్రసాద్ సహాయంతో ఆయన భగవద్గీత శ్లోకాలు చెబుతుండగా, ఆ శ్లోకాలు, వాటికి ప్రతి పదార్థములు, తాత్పర్యాలు రాశారు. అలా గీతలోని మొత్తం 701 శ్లోకాలు పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం పట్టింది. 2000సంవత్సరంలో 'బ్రెయిలీ లిపిలో భగవద్గీత' పుస్తకాన్ని ఆయన అంధుల ముందుకు తీసుకువచ్చారు.

### అంధత్వంలోనూ అద్భుతమైన అష్టావధానం

గీతా సారాంశాన్ని అవపోసన పట్టిన బీటీ లక్ష్మన్న భగవద్గీతపై ఇప్పటి వరకు ఎన్నో అష్టావధానాలు నిర్వహించారు. అలాగే ఇప్పటి వరకు 79 గీతా జ్ఞాన యజ్ఞములు (భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని తెలియజేసే కార్యక్రమాలు) నిర్వహించారు. తన తండ్రి స్మారకార్థం ఆలూరు మండల కేంద్రంలో స్వంత ఖర్చుతో 'బ్రెయిలీ భగవద్గీత ఆలయం' నిర్మించారు. ఇందులో గోమాత సమేత శ్రీకృష్ణ భగవానుడు, రాధ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయం ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. బీటీ లక్ష్మన్న 2005లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. 2012లో కర్నూలులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బ్రెయిలీ భగవద్గీత రాసిన సందర్భంగా నాటి రాష్ట్ర మంత్రి టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం పొందారు. అలాగే సావిత్రీబాయి పూలే అవార్డు, ఉగాది ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. బాల్యంలో తనకు ఉన్న ఐదు సంకల్పాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం, శ్రీకృష్ణ మందిరం నిర్మాణం, బ్రెయిలీ లిపిలో గీతా ముద్రణ వంటిని పూర్తయ్యాయని, బ్రెయిలీ లిపిలో బైబిల్, ఖురాన్ గ్రంథాలను రాసేందుకు సిద్ధపడుతున్నానని చెప్పారు. బైబిల్, ఖురాన్ గ్రంథాల పఠనంలో నిష్ణాతులైన వారు తనకు లభిస్తే ఈ రెండు గ్రంథాలను కూడా పూర్తి చేస్తానని ఆయన చెబుతున్నారు. అలాగే ఉద్యోగ విరమణ అనంతరం అంధులకు ఆశ్రమ నిర్మాణం, తపస్సుతో కూడిన జీవితాన్ని ఆశ్వాదించడం తన లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతితో కర్నూలులోని నవభారత్ బీఎడ్ కళాశాల ద్వారా బీఎడ్ చదువుతున్న ఆయన యువతకు స్ఫూర్తిగా అనేక కార్యక్రమాలను చేపట్టే ఆలోచన ఉందని పేర్కొన్నారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకుపోతే సాధ్యం కానిది అంటూ ఏదీ లేదని ఆయన చెబుతున్నారు.

- బ్రెయిలీ లిపిలో భగవద్గీత...!
- అంధత్వంలోనూ అష్టావధానంలో దిట్ట
- గీతా శ్లోకాలను అవపోసిన పట్టిన పండితుడు
- సొంతూరిలో బ్రెయిలీ భగవద్గీత ఆలయ నిర్మాణం
- చీకటి చక్రవర్తిగా రాణిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న

అభినవ బ్రెయిలీ



అప్పటి మేయర్, జేసీ, మంత్రి కేఈ ప్రభాకర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరిస్తూ





# వాత్సల్యమూర్తులు

- పిల్లల సంతోషమే కోసమే..
- పాశ్చాత్య పోకడలతో తల్లిదండ్రులపై తగ్గుతున్న ఆప్యాయత
- వృద్ధులకు అండగా నిలిచిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- నేడు జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం

అమృతాన్ని పంచేది అమ్మ. అనురాగాన్ని అందించేది నాన్న. తల్లిదండ్రులు పంచే ఆప్యాయత భూప్రపంచంలోనే వెలకట్టలేనిది. మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన తల్లిదండ్రుల పాత్రను వివరిస్తూ జూలై 4వ ఆదివారాన్ని తల్లిదండ్రుల దినోత్సవంగా జరుపుకోవడం సాంప్రదాయంగా కొనసాగుతోంది. 1994లో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ ఫాదర్స్‌డే, మదర్స్‌డేలను రద్దు చేసి తల్లిదండ్రుల విషయంలో లింగబేధం ఉండరాదన్న ఉద్దేశ్యంతో తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించగా ఆదేశ సుప్రీం కోర్టు ఇందుకు అంగీకరించింది. మనదేశంలో కూడా జూలై 4వ ఆదివారాన్ని తల్లిదండ్రుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

**ఆత్మకూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి):** మమతానురాగాలకు ప్రతిరూపాలు తల్లిదండ్రులు. సమాజంలో తల్లిదండ్రులకు ఉన్నతమైన పాత్ర ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించాల్సిన కనీస విషయాలను తెలియపర్చాల్సిన అవసరం ఉంది. సమాజంలో తల్లిదండ్రులకు, గురువులకు, కుటుంబానికి, మన చుట్టూ వుంటే బాహ్య ప్రపంచానికి ఏరకమైన గౌరవాన్ని అందించాలన్న విషయాలను పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇంట్లో ఎవరైనా వృద్ధులు ఉంటే వారిపై చూపించాల్సిన ప్రేమానురాగాలను పిల్లలు గ్రహించే సేవలు అందించాలి.

### ప్రతి ఒక్కరూ బాధ్యతగా..

వృత్తి, సామాజిక, ఆర్థిక పరంగా అనే ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ జీవిత చరమాంకంలో తల్లిదండ్రులపై ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలి. వృద్ధ్యాప్యంలో ఒక తోడుకోసం.. ఓ తియ్యని మాట కోసం అల్లాడిపోయే తల్లిదండ్రులకు అప్యాయతను పంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రుల దినోత్సవ ప్రాముఖ్యతను తెలుసుకుని ప్రతి ఒక్కరూ అమృతమూర్తులైన అమ్మనాన్నల పట్ల ఆదరణ చూపుతారని ఆశిద్దాం.

### వృద్ధులకు అండగా..

భారతదేశ సమాజంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో చిన్నకుటుంబాలు ఎక్కువైపోయాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి అధికం కావడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. సంపాదన లేని తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, పోషణ కోసం చొరవ తీసుకుంది. ఇందుకుగానూ 2007లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మెయిన్‌టెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరేంట్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007 పేరుతో ఓ చట్టాన్ని ప్రవేశపెట్టింది.



### తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం..



తల్లిదండ్రులను చరమాంకంలో కంటిరెప్పలా సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉంది. ఇటీవల తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోని సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరం. తల్లిదండ్రులను గౌరవించే విధానాలు చిన్నతనం నుంచే పిల్లలు అలవర్చుకోవాలి.

● నాగరాజు, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు

### తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు



తమకు జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవమన్న విషయాన్ని పిల్లలు గుర్తించాలి. పిల్లలు ఉన్నత స్థితికి చేరుకోవడానికి తల్లిదండ్రులు పడే తపన అంతాఇంతా కాదు.

● గరుడాద్రి సత్యనారాయణశర్మ, పురోహితులు, ఆత్మకూరు

## మార్కెట్ యార్డుకు రోడ్డు ఏర్పాటు చేస్తాం

- సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి

**కర్నూలు అగ్రికల్చర్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్ నుంచి మెయిన్ రోడ్డుకు త్వరలోనే రహదారి ఏర్పాటుచేస్తామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ యార్డుకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలపై సమీపంలోని నివాసితులు అభ్యంతరాలను వ్యక్తంచేశారు. శనివారం సమస్యను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి సంబంధిత ప్రాంతంలో కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించినట్లు ఆమె తెలిపారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, మార్కెట్ కమిటీ అధికారులు, రెవెన్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఒక సమావేశాన్ని త్వరలోనే నిర్వహిస్తామన్నారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా రైతులు, స్థానికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

## కొండ ముచ్చుల దాడి

- పలువురికి గాయాలు
- భయాందోళనలో జలదుర్గం గ్రామస్థులు

**ప్యాపిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని జలదుర్గం గ్రామంలో గత రెండు రోజులుగా కొండ ముచ్చులు దాడిచేస్తున్నాయి. ఈదాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బయటికి పోవాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జలదుర్గంలో నెల రోజులుగా కొండ ముచ్చుల సంచారం అధికంగా మారింది. సమీపంలోని కొండ ప్రాంతం నుంచి గ్రామంలో వస్తున్నాయి. మిద్దెల మీద, పొలాల్లో వీటి సంచారం అధికంగా మారింది. రెండు రోజులుగా ఉమా, నాగిరెడ్డి, శోభ, ఓబులేసు, రామానాయుడు తదితరులపై కొండముచ్చులు దాడి చేసి గాయపరిచాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండ ముచ్చులను పట్టుకొని అడవిలో వదలాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉప ప్రధాన అర్చకుడి అనుమానాస్పద మృతి

- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న సూసైడ్ నోట్లు




పూజన్న స్వామి(ఫైల్)

**ఎమ్మిగనూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పూజన్న స్వామి(47) మృతి అనుమానాస్పదంగా మారింది. మొదట గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో మాత్రం పూజన్నస్వామి ఆలయ ఉన్నతాధికారుల, ప్రధాన అర్చకుల, వేదపండితులు వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రెండు సూసైడ్ నోట్లు వైరల్ అవుతున్నాయి. ఆలయంలో అనేక సమస్యలు ఉన్నాయని, అర్చకులను చులకనగా చూస్తున్నారని, ఉన్నతాధికారులకు తనపై ఫిర్యాదులు చేసి అధికారం చెలాయిస్తున్నారని, తనపై కక్ష సాధింపు చేస్తున్నారని రాసి ఉంది. ప్రాణార్పణ చేసుకుంటున్నాను నన్ను క్షమిచండి అని రెండు సూసైడ్ నోట్లలో రాయటం అనుమానాలకు బలం చేకూరుతోంది. పూజన్నస్వామి గుండెపోటుతో మృతి చెందాడా? వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నారా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు మాత్రం ఆయన మృతిపై ఎలాంటి అనుమానాలను వ్యక్తం చేయటంలేదు. పూజన్న స్వామి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు చెబుతున్నారు. ఈవిషయంపై సీఐ అశోక్ కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యులనుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. సూసైడ్ నోట్లు ఆయన సొంతంగా రాశారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. గిట్టని వారు రాసి ఉండవచ్చు కదా అన్నారు. ఆలయ ఈవో విజయరాజ్‌ను వివరణ కోరగా ఆయనపై నాకు ఎలాంటి కక్ష సాధింపు లేదన్నారు. ప్రధాన అర్చకుడు, వేదపండితులు మధ్య వ్యక్తిగత అభిప్రాయ భేదాలు ఉండే విషయం నాకు తెలియదు. దేవదాయశాఖ నిబంధనల మేరకు గర్భగుడిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**కోవెలకుంట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. వివరాలు.. మండలంలోని కలుగొట్లకు చెందిన సుదర్శన్‌రెడ్డి(40), క్రిష్ణవేణి దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. 12 సంవత్సరాల క్రితం భార్య క్రిష్ణవేణి అనారోగ్యంతో మృతి చెందింది. పిల్లలను బంధువుల వద్ద వదిలి సుదర్శన్‌రెడ్డి ఒంటరి జీవితం గడిపేవాడు. 15 రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రికి వెళ్లి చూపించగా కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు తెలిపారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సుదర్శన్‌రెడ్డి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రేమ పేరుతో మోసపోవద్దు : డీఎస్పీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ

**ఆదోని రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ప్రేమ పేరుతో మోసపోయి వంచనకు గురికావద్దని ఆదోని డీఎస్పీ హేమలత విద్యార్థినులకు సూచించారు. శనివారం రూరల్ సీఐ నల్లప్ప, ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి ఆరేకల్లు బాలికల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు వద్దని సూచించారు. బలవన్మరణాలకు పాల్పడవద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి, ఉన్నతంగా చదివి పాఠశాల, తల్లిదండ్రులు, గ్రామానికి పేరు తీసుకొని రావాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## గిరిజన పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- పాణ్యం సీహెచ్‌సీకి తరలింపు
- పాఠశాలను పరిశీలించిన ఐటీడీఏ పీవో, అధికారులు



పాణ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



మురుగు కాల్వలో తాగునీటి పైపులైను

**పాణ్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు శనివారం అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగించింది. విద్యార్థులు విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా అధికారులు పాణ్యం సీహెచ్‌సీకి తరలించారు. దీంతో అప్రమత్తమైన డీటీడబ్ల్యుఓ, శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ కోటయ్య పాణ్యంకు వెళ్లారు. పాఠశాలను పరిశీలించి, విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల్లో ఇద్దరి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు అస్వస్థత కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. తాగునీరు కలుషితం అయ్యాయన్న కారణంగా నీటి శ్యాంపిళ్లను నంద్యాల పరీక్ష కేంద్రానికి పంపారు.

### నెల రోజుల క్రితం మారిన విద్యార్థులు

పాణ్యం గురుకుల పాఠశాల భవనంలో ఉంటున్న 218 మంది విద్యార్థులు అరకొర వసతులతో విద్యనభ్యసిస్తున్నారు. కాగా నెల రోజుల క్రితం డ్రైనేజీ కారణంగా నెరవాడ మెట్ట సమీపంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాల భవనంలోకి మార్చారు.

ఈ పాఠశాల పక్కనే మురుగుగా ప్రవహిస్తున్న ఎస్సార్బీసీ కాలువలోనే విద్యార్థులకు అందించే తాగునీటి పైపులైను ఉండడం గమనార్హం. ఈ పైపులైను లీకేజీల వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా పాణ్యంలో పాఠశాల భవనం నుంచి వెలువడే మురుగు నీరు బయటకి వెళ్లడానికి గత ఏడాది నుంచి ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ కలెక్టరు, ఎమ్మెల్యే, పీఓలకు వినతిపత్రాలు అందజేస్తూ వచ్చారు. ఈ క్రమంలో నెలరోజుల క్రితం విద్యార్థులను నెరవాడ మెట్ట సమీపంలోని మినీ గురుకులం భవనానికి తరలించారు.

ఈ భవనంలో మూడు మరుగుదొడ్లు ఉండడంతో 218 విద్యార్థులకు సరిపోకపోవడంతో వారు బయటకు వెళ్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం కూడా అస్వస్థతకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా మినీ గురుకులంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని డిమాండ్లు ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు.

### అస్వస్థతకు అధికారుల నిర్లక్ష్యమే కారణం

విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి అధికారులే కారణం. ఏడాదిగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదు. మురుగుకాలువ వెళ్లే స్థలం ప్రభుత్వానిది కాగా ఈ స్థలం ఆక్రమణకు గురైనా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్షానికి నిదర్శనం. అస్వస్థతకు గల కారణాలను విశ్లేషించి మళ్లీ ఈ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి. మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి నాణ్యమైన తాగునీరందించాలి.

- దేవదానం, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు

### మెనూ ప్రకారమే ఆహారం పంపిణీ

మెనూ ప్రకారమే ఆహారం అందించాం. శుక్రవారం సాయంత్రం కారం బొరుగులు, రాత్రి అన్నం, సాంబారు, శనివారం ఉదయం ఇడ్లీ, చట్నీ అందించాం. తాగునీరు బోరునుంచి వచ్చే నీటిని పంపిణీ చేస్తున్నాం. పాణ్యంలో పాఠశాల నుంచి వెలువడే మురుగు నీరు నిల్వకు అనువైన ప్రాంతం లేకపోవడంతో నెరవాడ మెట్ట సమీపంలోని మినీ గురుకుల భవనానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చాం. కలుషిత నీరే కారణమన్నది నీటి పరీక్షల అనంతరం తెలుస్తుంది. విద్యార్థులకు అనువైన మరుగుదొడ్లు లేవు. - కృష్ణానాయక్, ప్రిన్సిపాల్

### రెండు రోజుల్లో సమస్య పరిష్కారం

రెండు రోజుల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు అందించేలా చర్యలు చేపడతాం. పాణ్యంలోని మురుగుకాల్వ సమస్యను పరిష్కరిస్తాం. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. గురుకుల పాఠశాలకు మంజూరైన భవన నిర్మాణానికి చర్యలు చేపడతాం. - వెంకటశివప్రసాద్, డీటీడబ్ల్యూఓ

## ఎంఈవో, హెచ్‌ఎం పోస్టుల భర్తీ



**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లాల్లో మండల విద్యాశాఖాధికారుల పోస్టులను భర్తీ చేస్తూ ఆర్జేడీ శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీచేశారు. ఎంఈవోలుగా కొనసాగుతూ ఇటీవల రిటైర్ అయిన వారి స్థానాలతో పాటు ఒకరికి రెండు పదవులు లేకుండా పూర్తిస్థాయిలో ఎంఈవో పోస్టులను గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేశారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి ఎంఈవో-2గా పనిచేస్తున్న మద్దయ్య గత నెలలో రిటైర్డ్ కాగా ఆ స్థానంలో కోయిలకొండలో జడ్పీ పాఠశాల హెచ్‌ఎం షైబేల్‌ను నియమించారు. కొలిమిగుండ్ల ఎంఈవో-1గా, ఎఫ్ఏసీపై సంజామల ఎంఈవో-1గా పనిచేస్తున్న రాజయ్య ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో బనగానపల్లె ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణయ్యను కొలిమిగుండ్ల ఎంఈవోగా-1గా, సంజామల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రమణారెడ్డిని సంజామల ఎంఈవో-1గా నియమించారు. పగిడ్యాల ఎంఈవో-1గా, నందికొట్కూరు ఎంఈవో-1 ఎఫ్ఏసీగా పనిచేస్తున్న సుభాన్‌ను నందికొట్కూరు ఎఫ్ఏసీని తప్పించి నందికొట్కూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డిని ఎంఈవో-1 గా నియమించారు. కొత్తపల్లె మండల ఎంఈవోగా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నాగరాజును, సున్నిపెంట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మేరీ మార్గరేట్‌ను ఆత్మకూరు ఎంఈవో-1గా, తిమ్మాపురం పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్‌ను మహానంది ఎంఈవో-2గా, ఏనుగుల మర్రి జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రఘునాయక్‌ను డోన్ ఎంఈవో-2గా నియమించారు.

### ఎస్ఏలతో హెచ్‌ఎం పోస్టుల భర్తీ

ఉమ్మడి జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లతో భర్తీ చేశారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాల గణితం ఉపాధ్యాయులు శేషశయనా రెడ్డిని అదే పాఠశాల హెచ్‌ఎంగా నియమించారు. గడిగరేవుల పాఠశాల హెచ్‌ఎంగా చంద్రావతి, తిమ్మాపురం జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా చంద్రశేఖర్‌రెడ్డి, సంజామల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా షబ్బీర్ హుస్సేన్, ఆత్మకూరు జడ్పీ ఉర్దూ హైస్కూల్ హెచ్‌ఎంగా మోహన్‌బాబు, ఆత్మకూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా దేవనాథన్ నియమితులయ్యారు. అలాగే నందికొట్కూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా సిద్ధయ్య, కలమందలపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా రమేష్‌కుమార్, సున్నిపెంట ప్రభుత్వ ప్రాజెక్టు హైస్కూల్ హెచ్‌ఎంగా పద్మావతి, బనగానపల్లె ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనివాసులు, ఏనుగుమర్రి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా రాజశేఖర్‌ను నియమించారు.

## కార్గిల్ వీరుల త్యాగాలు మరువలేనివి

- కలెక్టరేట్ ఎదుట అమరులకు నివాళి



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

**కర్నూలు స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని పలువురు మాజీ సైనికులు కొనియాడారు. శనివారం అమరులైన జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య చౌదరి, బాబురాజు, నాగేశ్వరరావు, శర్మ శేషం రాజు, మున్నీరు రాజారెడ్డి, కృష్ణయ్య, మాజీ సైనికులతో కలిసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అంతకుముందు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జవానులు నర్రా పేరయ్య, సెక్రటరీ ఎం.సుధాకర్, ట్రెజరర్ నజీర్ అహ్మద్, డోన్ రాముడు, ఆత్మకూరు సింగ్, మరి కొంతమంది మాజీ సైనికులకు జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు సన్మానించారు.

## ఉభయ సభల సంయుక్త కమిటీల చైర్‌పర్సన్‌గా గౌరు చరిత



**కల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సభ్యులతో 2025-26 ఏడాదికి ఉభయ సభల సంయుక్త కమిటీల చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు శనివారం కూటమి ప్రభుత్వం కమిటీ జాబితాను విడుదల చేసింది. మహిళ, శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే గౌరుచరితను నియమించారు. కమిటీ సభ్యులుగా గల్లా మాధవి, డాక్టర్ దసరి సుధ, నులవల విజయశ్రీ, పరిటాల సునీతమ్మ, పల్లె సింధూరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, లోకం నాగ మాధవి, పరుపుల సత్యప్రభ, టి.కల్పలత, కావలి గ్రీష్మప్రసాద్, డా.ఏ మధుసూదన్ ఉన్నారు.

## 'దూదేకుల కార్పొరేషన్' ఏర్పాటు హర్షణీయం

- క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా



**కర్నూలు అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** నూర్ బాషా దూదేకుల సంక్షేమం కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై రాష్ట్ర నూర్ బాషా (దూదేకుల) సంఘం క్రమ శిక్షణా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కర్నూలులో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వెనుక బడిన నూర్ బాషా దూదేకుల సామాజిక వర్గానికి న్యాయం చేయడం కోసం ప్రత్యేకంగా ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయించడం పట్ల రాష్ట్రంలోని దూదేకుల కులస్తులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగిందని తెలిపారు. తరతరాలుగా అన్ని రంగాల్లో వెనుకబడిన దూదేకుల కులస్తులకు తెలుగుదేశం హయంలో ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమ కులస్తులకు తీపి కబురు లాంటిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి రాష్ట్రంలోని 18లక్షల దూదేకుల కులస్థులు అండగా ఉన్నందుకు చంద్రబాబు రుణం తీర్చుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఓబులమ్మ చెరువును ఆక్రమిస్తే చర్యలు

● మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు



చెరువు రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

**పాణ్యం, జూలై 26(ఆంధ్రజ్యోతి):** మండలంలోని సుగాలిమెట్ట సమీపంలోని ఓబులమ్మ చెరువును ఆక్రమిస్తే చర్యలు తప్పవని మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రుడు హెచ్చరించారు. శనివారం ఓబులమ్మ చెరువును రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. 1638 సర్వేలోని ఓబులమ్మ చెరువు విస్తీర్ణం 8.09 ఎకరాలు ఉందన్నారు. కొందరు చెరువును ఆక్రమించడంతో వెంటనే ఆక్రమణలు తొలగించాలని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ మేరకు చెరువు హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో చెరువు అభివృద్ధి పనులు చేపడతామ న్నారు. ఆర్ఐ రాము, వీఆర్వో శంకర్, సర్వేయరు సుబ్బయ్య పాల్గొన్నారు.

## బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం డీఈవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసిన అనంతరం డీఈవో జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజే శారు. యూటీఎఫ్ నాయకులు ప్రసాద్, సుధాకర్ మాట్లాడుతూ బది లీలు పూర్తయి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ క్యాడర్ స్ట్రెంత్ సమస్య, పొజిషన్ ఐడీల సమస్య పరిష్కారం కాలేదన్నారు. అధికారులు ఉపాధ్యా యుల జీతాల సమస్యపై దృష్టిసారించడం లేదన్నారు. నిరంతరం ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని, దీనివల్ల విద్యార్థులకు చదువు దూరం అయ్యే ప్రమాదం ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, రామకృష్ణుడు, ఖాశీం, నరసింహారెడ్డి, అరవిందకుమార్‌చ గోపాల్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజా పాలన

**నందికొట్కూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో క్లస్టర్ ఇంచార్జీ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజే శారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాలిబాషా, కో క్లస్టర్ ఎస్ఎండీ జమీల్, రసూల్ ఖాన్, కుమార్, సనాఅబ్దుల్లా, మన్సూర్, శేఖర్, ఆయిల్ రవి, కాలం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

**బండిఆత్మకూరు:** మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్రవహించారు. 28వ యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో పరమటూరు 146, సంతజూటూరు 147, 148, పెద్దదేవళాపురం 149, 150 బూతుల్లో వంద శాతం సాధించారు. అలాగే బండిఆత్మకూరులోని 189, 164, 166 బూతుల్లో యూనిట్ ఇన్‌చార్జి జాకీర్ ఖాన్ వంద శాతం పూర్తి చేశారు. ఇంటింటా తొలి అడుగులో వంద శాతం పూర్తికి కృషి చేసిన బూత్ కన్వీనర్లు, గ్రామ అధ్యక్షులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ భూమి పరిశీలన

● సంయుక్తంగా సర్వే చేసిన రెవెన్యూ, అటవీశాఖల అధికారులు



చర్చిస్తున్న అధికారులు

**గడివేముల, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గని గ్రామంలోని 910 సర్వే నంబర్‌లోని భూమిని కేటాయించాలని ఓ ప్రముఖ సంస్థ దరఖాస్తు చేసుకోవడంతో శనివారం రెవెన్యూ, ఫారెస్టు అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. 910 సర్వే నంబర్‌లోని 1,480 ఎకరాలు తమదే అంటూ అటవీశాఖ, రెవెన్యూశాఖ చెబుతుండడంతో ఆర్డీవో విశ్వనాథ్, ఫారెస్టు రేంజి అధికారి ప్రవీణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రామ్మోహన్, డీఐలు వెంకటచెన్నయ్య క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం భూమి తమదేనని, రెవెన్యూశాఖ 1909 సంవత్సరంలో అటవీశాఖకు భూమిని అప్పగించిందని అటవీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో విశ్వనాథ్ తెలి పారు. తహసీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న లెప్రసీ, క్షయ నివారణ అధికారి

**ఆత్మకూరురూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలని జిల్లా లెప్రసీ, క్షయ నివారణ అధికారి శారదాబాయి, వైద్యాధికారి పవన్‌కుమార్ కోరారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం తనిఖీ చేశారు. క్షయ వ్యాధిపై చేపడుతున్న సమగ్ర సర్వే వివరాలు, రోగులకు అందుతున్న చికిత్సల వివరాలను వైద్యాధికారులు, టీబీ సూపర్ వైజర్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ద అనంతాపురంలో నిర్వహిస్తున్న క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సును ఆమె సమీక్షించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు కల్లూరి మస్తానయ్య, రవికుమార్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

**వెలుగోడు, జూలై 26( ఆంధ్రజ్యోతి):** వెలుగోడు మండలంలోని ఐసీడీఎస్‌శాఖ అంగన్‌వాడీలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు దరఖాస్తులు సూపర్‌వైజర్ కోమల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రేగడగూడూరు గ్రామంలో మూడో సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు ఓసీ క్యాటగిరికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31లోపు ఆత్మకూరులో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

# యూరియా కోసం ఎదురుచూపులు

● కొత్తపల్లి మండలంలో 5వేల హెక్టార్లలో పంటల సాగు
● ఇప్పటి దాకా 400 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
● ఇంకా 180 మెట్రిక్ టన్నులు అవసరం



యూరియా కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

**కొత్తపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి):** కొత్తపల్లి మండలంలో 20 రోజులుగా రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు జోరుగా కురుస్తున్న వర్షాలు, మరో వైపు యూరియా కోసం రైతన్నలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా కొత్తపల్లి మండలంలో అధిక శాతం మెట్ట ప్రాంతం కావడంతో వేలాది హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగు చేయడంతో యూరియాకు ప్రత్యేక డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పంటలు ఇప్పుడిప్పుడే ఆశాజనకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మొక్కజొన్నకు భూముల్లో వేసే మందులు అవసరం కావంతో మండలంలో యూరియా కొరత ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఎప్పుడు యూరియా వస్తుందా? అని పనులు వదులుకుని రైతులు ఎదురు చూడడమే వారి వంతైంది. అరకొరగా కొన్ని రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను కొంత మంది రైతులకు మాత్రమే సరిపోయింది. దీంతో మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 5వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. రెండు దఫాల్లో 400 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారిణి అమీరున్నీసా భేగంను వివరణ కోరగా.. వచ్చిన యూరియాను వెంటవెంటనే రైతులకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. 180 మెట్రిక్ టన్నుల అవసరం ఉందని, ఇండెంట్ పంపించామని తెలిపారు. త్వరలోనే మళ్లీ వస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు.

### వారం నుంచి ఎదురు చూస్తున్నా



మూడెకరాల సొంత భూమితో పాటు ఏడెకరాలు కౌలుకు తీసుకున్నాను. వారం రోజులుగా యూరియా కోసం ఎదురు చూస్తే మూడు బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారు. తను సాగు చేసిన పదెకరాలకు యూరియా సరిపోదు. యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి.

● వెంకటరమణ, రైతు, నందికుంట

### యూరియా కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

యూరియా కొరత సృష్టించకుండా ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో రైతు సంఘం నాయకుడు శంకర్ రెడ్డి అధ్యక్షతన శనివారం రైతు సంఘం మండల సమావేశం నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఒక్క పాస్‌పుస్తకానికి ఒకటి, లేదా రెండు యూరియా బస్తాలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారు తమకు కావాల్సిన యూరియాను తరలించుకుపోతున్నారని, సన్నకారు రైతులకు అందడం లేదని అన్నారు. రూ.266 ధర ఉన్న యూరియా బస్తాను రూ.310 నుంచి రూ.350కు ప్రైవేటు డీలర్లు విక్రయిస్తూ బిల్లులు మాత్రం రూ.266లకు వేస్తున్నారని ఆరోపించారు. సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**నంద్యాల రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చాపిరేవుల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షహలం సూచించారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇళ్ల ముందు నీటి నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో నీటిని కాచి వడపోసి తాగితే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. జ్వరం, కీళ్లనొప్పులు, చలి, దగ్గు, జలుబు, నీరసం, తలనొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. పీహెచ్ పరిధిలోని 8 గ్రామాలకు గాను ఒక లెప్రసీ వ్యాధి ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు నమోదు కాలేదన్నారు. ప్రతి ఇంటా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

## రైతు సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

**కొత్తపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** రైతు సంఘం కొత్తపల్లి మండల నూతన కార్యవర్గం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండలంలోని సింగరాజుపల్లెలో శనివారం శంకర్‌రెడ్డి అధ్యక్షతన రైతు సంఘం మండల సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా గంగన్న, ఉపాధ్యక్షులుగా శంకర్ రెడ్డి, వెంకటేశ్వరగౌడు, ప్రధాన కార్యదర్శిగా సంజీవరాయుడు, సహాయ కార్యదర్శిగా దాసుతో పాటు 11 మంది సభ్యులు నూతన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గోపాల్, మూర్తి, శ్రీనివాస్ నాయక్, సుబ్బరాయుడు, రైతు సంఘం నాయకులు వీరన్న, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి'

**పగిడ్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తున్న సిబ్బందిని అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. బీరవోలు గ్రామంలో శనివారం సీపీఎం మండల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. రమేష్ కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకంలో ఆడబిడ్డ నిధి అనే పథకంతో ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని, రైతులకు అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, గంధం హుస్సేనమ్మ, మండల కన్వీనర్ పక్కీర్ సాహెబ్, ఈశ్వరమ్మ, తిక్కస్వామి, బాబు, మద్దమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి బంగారు పతకం

**మహానంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని మహానంది వ్యవసాయ కళాశాలలో అగ్రానమీ విభాగం సేద్య విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వల్లూరి సంధ్యారాణి అనే విద్యార్థిని బంగారు పతకం సాధించింది. విద్యార్థిని తన పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీలో శనగపంటలో రైజోబియం, సివిడ్ ప్రభావం అనే పరిశోధన అంశాన్ని వ్యవసాయ కళాశాల అసోసియేట్ శాస్త్రవేత్త(అగ్రానమీ) డాక్టర్ ఎ.మల్లేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పూర్తి చేసింది. తన పోస్టు గ్రాడ్యుయేషన్‌ను 2021-23 సంవత్సరంలో మహానంది వ్యవసాయ కళాశాలలో పూర్తి చేసింది. విజయవాడలో జరిగిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని సంధ్యారాణి తన పోస్టు గ్రాడ్యుయేషన్ అగ్రానమీ విభాగంలో యూనివర్సిటీ స్థాయిలో అధిక గ్రేడ్(ఓజీపీఏ) సాధించినందుకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంది. ఈమేరకు విద్యార్థినిని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి, అసోసియేట్ శాస్త్రవేత్త ఎ.మల్లేశ్వరరెడ్డితో పాటు సిబ్బంది అభినందించారు.

## ఎన్టీఆర్ జలాశయం పరిశీలన



నందికొట్కూరులో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

**నందికొట్కూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి):** నందికొట్కూరులోని ఎన్టీఆర్ జలాశయాన్ని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ శనివారం పరిశీలించారు. పట్టణంలోని దేవదాయశాఖకు చెందిన భూమిలో 60 సెంట్లు ఎన్టీఆర్ జలాశయానికి నాడు ఇచ్చారని, మిగిలిన 40 సెంట్ల భూమిని పరిరక్షించేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు జలాశయాన్ని కబ్జా చేస్తున్నారని ఆరోపించడంతో ఆర్డీవో పరిశీలించారని ఈవో సాయి తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులను పరిశీలించి నివేదికలను కలెక్టర్‌కు పంపుతామని ఆర్డీవో తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

**ఆత్మకూరు:** సమాచార హక్కు చట్టంపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, ఆ చట్టంలోని అన్ని అంశా లపై అవగాహన ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి సూచించారు. పట్టణంలోని సెరికల్చర్ ఆఫీసులో పట్టు పరిశ్రమ శాఖ - సమాచార హక్కు చట్టం - 2005పై శనివారం ప్రముఖ న్యాయవాది శ్రీధర్ అడిగి ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి నగేష్, సిబ్బంది ఉన్నారు.

## సారాకు దూరంగా ఉండాలి




మాట్లాడుతున్న ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి

**ఆత్మకూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ సారాకు దూరంగా ఉండాలని, నిర్మూలనలో బాధ్యతగా వ్యవహరించాలని ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నవోదయం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సారా తయారీ, విక్రయించడం, రవాణా చేయడం, కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని అన్నారు. సారా వల్ల ఆరోగ్యాలు దెబ్బతినడమే కాకుండా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందన్నారు. మత్తు పదార్థాల జోలికి ఎవరు వెళ్లవద్దని సూచించారు. ఎక్కడైనా నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14405, ఫోన్ 9440902585 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్ఐ జగదీష్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణ, ఎన్‌సీసీ అధికారి విద్యాసాగర్, అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, తిరుపతమ్మ, అనిల్‌కుమార్ ఉన్నారు.

## మాజీ సైనికుడికి మృతి



శశికుమార్ (ఫైల్)

**నంద్యాల టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** నంద్యాలకు చెందిన మాజీ సైనికుడు శశికుమార్ (56) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతిపై కర్నూలు మాజీ సైనికుల సంఘం తరఫున అధ్యక్షుడు నర్రా పేరయ్య చౌదరి సంతాపం తెలిపారు. మాజీ సైనికులు ధన విజయుడు, షాకీర్ బాషా, ఏఎం రెడ్డి, మల్లికార్జున, నారాయణ, రఘురామిరెడ్డి, మాజీ నాయబ్ సుబేదార్ రఘునందన్, మాజీ హౌలర్లు కేశవర్ధన్, శ్రీనివాసులు తదితరులు శశికుమార్ భౌతికకాయానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

## 'అక్రమాలను అరికట్టాలి'



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ సంఘ్ నాయకుడు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో యూరియా అక్రమ అమ్మకాలను అరికట్టాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మహేశ్‌రెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌కు చేరుకుని జేసీకి వినతిపత్రం అందజేసిన అనంతరం భారతీయ కిసాన్‌సంఘ్ నాయకుడు మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల ప్రాంతంలో యూరియా రూ.400కు విక్రయిస్తున్నారని, యూరియాను ఆర్ఎస్‌కేల ద్వారా అందించాలని కోరారు. అక్రమంగా వెళ్తున్న యూరియాకు సహకరిస్తున్న అధికారులపై, డీలర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## బీజేపీ బలోపేతానికి కృషి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు



మాట్లాడుతున్న అభిరుచి మధు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటేవిధంగా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో ఎన్నో సమస్యలున్నప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా పీవీఎన్ మాధవ్ అధ్యక్షులు అయిన తర్వాత మొట్టమొదటి పర్యటనను రాయలసీమను ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆదివారం రాత్రి నంద్యాలకు చేరుకుని సూరజ్ గ్రాండ్‌లో బసచేసి, 28వ తేదీన పట్టణంలోని ఒక ప్రాంతంలో చాయ్ పే చర్చా కార్యక్రమం పాల్గొని స్థానిక సమస్యలపై ఆరా తీస్తారన్నారు. అనంతరం పద్మావతినగర్ ఆర్చి నుంచి పట్టణ పురవీధుల మీదుగా శోభాయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## విజయవంతం చేయాలి

**పాణ్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 29న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కర్నూలు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ పాణ్యం అసెంబ్లీ కోఆర్డినేటర్ శ్రీరామమద్దిలేటిరెడ్డి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం పాణ్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ మండల స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిలేటి, సీతమ్మ, మండల అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శకుంతలముని, సంతోష్, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, రామభద్ర పాల్గొన్నారు. అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆసుపత్రిలో పరామర్శించారు. అస్వస్థతకు కారణాలపై అధికారులు సమీక్షించాలని కోరారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




విద్యా సామగ్రి అందజేస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి

**బండిఆత్మకూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి):** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, గిరిజన విద్యార్థులు బడికి వెళ్ళి బాగా చదువుకోవాలని సీఐ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని నారపురెడ్డికుంట గూడెంలోని పాఠశాలలో శనివారం విద్యార్థులకు దుప్పట్లు, విద్యా సామగ్రి, బిస్కెట్లును సీఐ పంపిణీ చేశారు. తల్లి దండ్రులు పిల్లల్ని కచ్చితంగా బడికి పంపించాలని, చెంచులకు పోలీస్ శాఖ తరఫున తమ వంతు సహకారం అందిస్తామ హామీ ఇచ్చారు. సారా తయారు చేయొద్దని, తాగొద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెంచులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్మోహన్, బ్రాహ్మణ చెరువు ఛైర్మోపాల శంకర్ పాల్గొన్నారు.

# 18 కి.మీ.ల దూరంలో సచివాలయం

● ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు



తొగర్చేడు ఏరియల్ వ్యూ

**పాణ్యం, జూలై 26(ఆంధ్రజ్యోతి):** ఆ గ్రామానికి సచివాలయం 18 కిలోమీటర్ల దూరం. ప్రభుత్వ అధికారులతో పనిపడితే వెళ్లడానికి అందుబాటులో వాహన సౌకర్యం కూడా లేదు. మండలంలో 19 గ్రామాలకు 19 గ్రామ పంచాయతీ కార్యాలయాలున్నాయి. అలాగే 15 గ్రామ సచివాలయాలున్నాయి. వీటిలో తొగర్చేడు గ్రామానికి పంచాయతీ కార్యాలయం ఉంది. గ్రామంలో సచివాలయానికి కావాల్సిన జనాభా లేకపోవడంతో ఈ గ్రామాన్ని 18 కిలోమీటర్ల దూరంలోని నెరవాడ గ్రామంలోని సచివాలయానికి అనుసంధానం చేశారు. దీంతో నెరవాడ సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ తొగర్చేడుకు వెళ్లిరావడానికి తీవ్ర ఇబ్బందులకు గురతున్నారు. తొగర్చేడు ప్రజలు నెరవాడకు 10 కిలోమీటర్ల దూరంలోని నంద్యాలకు వెళ్లి అక్కడనుంచి 7 కిలోమీటర్ల దూరంలోని నెరవాడ మెట్టకు వెళ్లి అక్కడ నుంచి కిలోమీటరు నడిచి వెళ్లాలి. నెరవాడ నుంచి నంద్యాలకు వాహన సౌకర్యం లేదు. అలాగే నంద్యాల నుంచి తొగర్చేడుకు సమయానికి బస్సు సౌకర్యం లేక పోవడంతో ఆటోలలో వెళ్లాల్సి వస్తోందని సిబ్బంది పేర్కొంటున్నారు. నెరవాడ సచివాలయాన్ని రద్దు చేసి తొగర్చేడు గ్రామానికి అందుబాటులో ఉండే మద్దూరు సచివాలయానికి అనుసంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### మినీ సచివాలయం ఏర్పాటు చేయాలి



గ్రామంలో మినీ సచివాలయం ఏర్పాటు చేయాలి. సచివాలయంలో అవసరమైన పనికి నెరవాడకు వెళ్లడానికి విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గతంలో స్పందనలో ఫిర్యాదు చేశాం. అయినా ఇంత వరకు ఎటువంటి పరిష్కారం లభించలేదు. గ్రామంలో 1700 జనాభా ఉంది. సచివాలయం ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని అవకాశాలు ఉన్నాయి.

● శ్రీనివాసులు, తొగర్చేడు

### అధికారులు వెంటనే స్పందించాలి



సచివాలయ సమస్యపై అధికారులు వెంటనే స్పందించాలి. అధికారుల ధ్రువపత్రాలకు నెరవాడకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వెళ్లడానికి వాహన సదుపాయం లేకపోవడంతో పాటు నెరవాడకు వెళ్లడా నికి నెరవాడ మెట్ట నుంచి కిలోమీటరు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

● లక్ష్మీకాంత్, తొగర్చేడు

### ప్రతిపాదనలు పంపించాం



తొగర్చేడుకు ప్రత్యేకంగా సచివాలయం ఏర్పాటు చేయాలని 15 రోజుల క్రి తం పాణ్యం ఎంపీడీవో ద్వారా డీఎల్‌డీవోకు వినతిపత్రం గ్రామ కమిటీ తరఫున అంద జేశాం. గత ఏడాది ఎన్నికల కోడ్ రావడంతో సచివాల యానికి చేసిన ప్రయత్నాలు మూలన పడిపో యినట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

మల్లేష్, పంచాయతీ కార్యదర్శి

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## నాడు వెలవెల.. నేడు కళకళ


నాడు ముళ్ల కంపలతో నిండుకున్న కేసీ పంట కాలువ

చాగలమర్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చాగలమ ర్రి సమీపంలోని కేసీ ప్రధాన కాలువ నుంచి ఆయక ట్టుకు నీరందించే కేసీ పంట కాలువలకు ఉపా ధి నిధులతో మరమ్మతులు చేపట్టారు. 'దెబ్బతిన్న కేసీ లైనింగ్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కేసీ పంట కాలువలో పేరుకుపోయిన పూడికతీత, ముళ్ల కంపలను ఉ పాధి కూలీలచే కాలువలను మరమ్మతు చేయించారు. దీంతో కాలువలో సాగునీరు ప్రవహిస్తోంది. చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందేలా అధి కారులు చర్యలు చేపట్టారు. నాడు వెలవెలబోతున్న కాలువలు ఈ ఏడాది మరమ్మతులకు నోచుకొని సాగునీటితో కళకళలాడుతున్నాయి.


నేడు మరమ్మతులు చేపట్టిన కేసీ పంట కాలువలో ప్రవహిస్తున్న నీరు

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులకు యూరియా కొరత లేదని ఏవో రంగనేతాజీ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యూరియా అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి డీలర్ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు నిర్ణయించిన ధరలకు మాత్రమే అమ్మాలని తెలిపారు. రైతులకు తప్ప నిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు.

## నవోదయ ప్రవేశానికి దరఖాస్తులు

చాగలమర్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లా బనవాసిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 9,11 తరగతిలో ప్రవేశానికి దరఖా స్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల శనివారం తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఆగస్టు 29 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొలిమిగుండ్ల, జులై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టామని తెలిపారు.

## క్షయరహిత సమాజమే లక్ష్యం


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ అధికారులు

చాగలమర్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత సమాజాన్ని రూపొందించడమే లక్ష్యమని హెల్త్ అధికారి రామలింగారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలో టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. టీబీ వ్యాధిగా గుర్తిస్తే 6 నెలల పాటు ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఉసేన్, ఏఎన్ఎం నర్సమ్మ, ఆశావర్కర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నట్లు కొలి మిగుండ్ల పీహెచ్‌సీ వైద్యులు డా.హరిచరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో టీబీ నివార ణకు సంబంధించి ఇప్పటికే 7000 వ్యాక్సిన్లు పంపిణీ చేసినట్లు తెలి పారు. మండలంలో 36 టీబీ కేసులు గుర్తించామని, వీరికి ఉచితంగా అన్ని వైద్య సేవలు, మందులు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 92 వేల ఎకరాలకు సాగునీరు

చాగలమర్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాజోలి ఆనకట్ట పరిధిలోని కేసీ కాలువ ఆయకట్టు కింద 92 వేల ఎకరాలకు సాగునీరు అందించ డమే లక్ష్యంగా ఉందని కేసీకెనాల్ డీఈ పుల్లయ్య తెలిపారు. శనివారం కేసీ పంట కాలువలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కడప జిల్లాలో 92 వేల ఎకరాలు, నంద్యాల జిల్లాలో 1.69 లక్షల ఎకరాలకు కేసీ కాలువల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. ఆయన వెంట ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

## రుద్రవరం ఏఈకి అదనపు బాధ్యతలు

రుద్రవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం హౌసింగ్ ఏఈ నాగరాజుకు నందికొట్కూరు, ఆత్మకూరు ఇన్‌చార్జి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒకేసారి మూడుచోట్ల విధులు నిర్వర్తిస్తుండడంతో రుద్ర వరానికి హౌసింగ్ ఏఈ రాకపోకలు తగ్గాయి. రుద్రవరం మండలంలో 16 సచివాలయాల పరిధిలో 21 పంచాయతీలు ఉన్నాయి. హౌసింగ్ నిర్మాణాలపై అవగాహన కల్పించే వారే కరువయ్యారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈ స్థానికంగా ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లలను నియమించాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

డోన్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తెలుగు విజయకుమార్, సుబ్బు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం డోన్ ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ రవికుమార్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్స్ లేకపోవడం వల్ల విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడుతుందన్నారు. సౌకర్యాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌పీఎస్ కోఆర్డినేటర్ బజారి, తది తరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో లాభాలు


గోసానిపల్లెలో పంట సాగును పరిశీలిస్తున్న అధికారి జి.కళ్యాణి

డోన్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంట సాగు రైతులకు ఎంతో ప్రయోజనకరమని డోన్ ఉద్యాన శాఖ అధికారి జి.కళ్యాణి అన్నారు. శనివారం మండలంలోని గోసానిపల్లె గ్రామ పరిసరాల్లో వేసిన ఆయిల్ పామ్ పంట సాగును పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగు కింద రైతులు వేసిన క్యాబేజీ, రోజ్ పూల పంట లను ఆమె పరిశీలించారు. అనంతరం రైతులకు ఆయిల్ ఫామ్ పంటల వల్ల లాభాలను అవగాహన కల్పించారు. ఆమె వెంట విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

కొలిమిగుండ్ల: ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులు తప్పనిస రిగా పంటనమోదు చేసుకోవాలని కోవెలకుంట్ల డివిజన్ హార్టికల్చర్ అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం కొలిమిగుండ్లలో పండ్ల తోట లను ఆయన పరిశీలించారు. వివిధరకాల పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అనంతరం కొలిమిగుండ్లలోని రైతు ఉత్పత్తుల కేంద్రాన్ని ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏలు సుబ్రహ్మణ్యం, శాంతి, రైతులు పేరం నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పూజలు


లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కొలిమిగుండ్ల, జులై 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే పూజలకు తిరుమల తిరుపతి దేవ స్థానం ఆగమ పండితులు వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30వ తేదీ వరకు నిర్వహించే ఈపూజల్లో రామ్‌కో సిమెంట్ సంస్థల మేనే జింగ్ డైరెక్టర్ వెంకటరామరాజా, మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, అధికారులు హాజరుకానున్నట్లు రామ్‌కో ప్రతిని ధులు వెల్లడించారు.

# ఉపాధి అవినీతిపై డిప్యూటీ సీఎంకు నివేదిస్తా

- ప్రభుత్వ పథకాలపై అధికారుల ఉదాసీనత
- అధికారుల తీరుపై మండిపడిన జడ్పీ చైర్మన్


మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల, జులై 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతి జరిగిందని, ఈ విషయాన్ని మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఉమ్మడి కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావే శంలో వివిధ శాఖల అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామాల్లో జరి గిన ఉపాధి పనుల్లో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై కలెక్టర్, పీడీ, విజిలెన్స్‌కు కూడా నివేదిస్తానని హెచ్చరించారు. మరో వైపు ఉపాధి, పశువైద్యం, వ్యవసాయ శాఖ, ఉద్యానవనం తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవ గాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమ ర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, అవసరమైతే జడ్పీ నిధు లు కేటాయిస్తానని అన్నారు. ప్ర భుత్వం నిధులు మంజూరు చేసి నా సకాలంలో భవన నిర్మాణం చేపట్టకుండా నిధులు నిరుపయోగంగా మార్చారని పంచాయతీరాజ్ ఏఈ అన్వర్‌బాషాపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు తమతమ శాఖల ప్రగతి నివేదికలను చదివి విని పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, తహసీల్దార్ శ్రీనివా సులు, ఎంపీపీ నాగవేణి, ఎంఈవో అబ్దుల్‌కలాం, ఏపీవో నిర్మల, ఏఈ కరీముల్లా, డా.హరిచరణ్‌రెడ్డి, ఏఈవో నాగరాజు, ఆయా శాఖల అధికా రులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవికి బీసీ రాజారెడ్డి సహకారం


లక్ష్మీదేవికి తన సొంత నిధులతో పింఛను డబ్బులు అందిస్తున్న బీసీ రాజారెడ్డి

కోవెలకుంట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వింత వ్యాధితో బాధప డుతున్న లక్ష్మీదేవికి ప్రతినెలా తాను పింఛన్ అందజేస్తానని బనగాన పల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వెల్లడించారు. ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కూతురుకి అన్నీ తానై..' కథనానికి బీసీ రాజారెడ్డి స్పందించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని తన కార్యాలయం వద్ద లక్ష్మీదేవికి రూ.500 పింఛన్ అందజేశారు. తన సొంత నిధులతో జీవితాంతం ప్రతినెలా పింఛన్ అందజేస్తానని ఆయన తెలిపారు. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వంలో హౌస్‌హోల్డ్ మ్యాప్ సర్వే ద్వారా ఉన్న వస్తున్న పింఛను రద్దయిన విషయం తెలు సుకుని ప్రభుత్వ అధికారులతో మాట్లాడి కొత్త పింఛను వచ్చేలా చర్య లు చేపడతానన్నారు. తన తండ్రి బీసీ గుర్విరెడ్డి జ్ఞాపకార్థం అంధు లకు, మానసిక వికలాంగులకు మంచానికే పరిమితమైనవారికి సుమారు 165 మందికి 16 సంవత్సరాల నుంచి ప్రతి నెలా ఒక్కొక్క రికి రూ.500 చొప్పున సొంత నిధులతో పంపిణీ చేస్తున్నామని తెలి పారు. అందులో భాగంగానే లక్ష్మీదేవికి కూడా పింఛను మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో ఆయనకు లక్ష్మీదేవి కుటుబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాస్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్ పోటీలు

కోవెలకుంట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణ పరి ధిలోని స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూలులో శనివారం జిల్లాస్థాయి షూటింగ్ బాల్ సెలక్షన్స్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గీతాసి స్టర్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి, పాఠశాల లకు పేరు తీసుకరావాలని నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈవో శంకర ప్రసాద్, డోన్ డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆకాక్షించారు. కార్యక్రమంలో కర్నూలు షూటింగ్ బాల్ సెక్రటరీ నాగరాజు, నంద్యాల జిల్లా సెక్రటరీ పరమేశ్వర్‌రెడ్డి, పీడీలు నాగమణి, జరీనా, హర్ష అండ్ ఓబులేసు, పీఈటీలు పాల్గొన్నారు.

## వైభవంగా చెన్నకేశవ పల్లకీ ఉత్సవం


చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురా ళ్లపల్లె వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులచే శనివారం వేద పండితులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పల్లకి ఉత్స వం వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా చెన్నకే శవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభి షేకాలు చేశారు. అనంతరం పురవీధుల గుండా గ్రామోత్సవం చేశా రు. కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మహిళలు పాల్గొన్నారు. అలాగే మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్స వం, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

- చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో శ్రావణమాసం సందర్భంగా శనివారం సీతారాములకు విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా సీతాదేవికి వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లకి ఉత్సవం చేశారు. అలాగే శెట్టివీడు, చాగలమర్రి, మూడురాళ్లపల్లె గ్రామ రహదారిలో వెలసిన అభయాంజనేయస్వామి, వీరాంజనేయస్వామికి పూజలు చేశారు.

## పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

డోన్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పచ్చనిచెట్లు.. ప్రగతికి మె ట్లు అని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ ఉమా అన్నా రు. శనివారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకుందా మని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం వల్ల మన దేశం కాలుష్యం నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సువర్ణదేవి, ఆర్ఐ చౌదరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు

డోన్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చికెన్ షాపుల యజమానులు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. పట్టణంలోని చికెన్ షాపుల యజమానులకు, వినియోగదారులకు జరుగుతున్న వాగ్వాదాల నేపథ్యంలో అర్బన్ సీఐ శనివారం మున్సిపల్ కమిషనర్‌కు లేఖను జారీ చేశారు. వినియోగదారులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ మధుసూదన్

ప్యాపిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైన అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్ నెంబర్ చెప్పమన్నా, ఓటీపీ అడి గిన చెప్పకూడదన్నారు. అలాగే ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండా లని విద్యార్థులకు సూచించారు. బైకులు కలిగిన విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామక్రి ష్ణయ్య, అధ్యాపకులు నవీన్‌పాటి, వెంకటరమణ, ఓబులేసు, ముస్తాక్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఉడుములపాడు చెరువుకు నీటి విడుదల


నీటిని పరిశీలిస్తున్న నాయకులు

డోన్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు నీరు విడుదల చేసినట్లు ఆ గ్రామ టీడీపీ నాయకులు నాగభూషణంగౌడు, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, రామాంజనేయులు గౌడు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదే శాల మేరకు హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నుంచి చెరువులోకి నీరు వదలడం జరిగిందన్నారు. చెరువుకు నీరు విడుదల కావడంతో గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఖలీల్ బాషా, శ్రీనివా సులు, రంగస్వామి, మహేష్‌గౌడు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

## నేడు మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం

సంజామల, జులై 26,(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగపల్లె పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు గురు రాజా గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శనివారం తెలిపారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, చర్మ, దంత, కంటి వ్యాధులు మహిళలకు సంబంధించిన వ్యాధులకు సంబంధించి కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన నిష్ణాతులైన వైద్యులు వైద్య శిబిరంలో పాల్గొంటారన్నారు. ప్రజలు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## వాహనదారులకు అవగాహన

దొర్నిపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూకొత్త పల్లె గ్రామంలో శనివారం ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు అతివేగంగా వెళ్లరాదని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని అన్నారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో రికార్డులు లేని మూడు ట్రాక్టర్లు, 5 ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. కార్యక్ర మంలో ఎస్ఐలు జయప్ప, నగిన, వరప్రసాద్, దొర్నిపాడు ఏఎస్ఐ రంగయ్య, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీసు సిబ్బంది ఉన్నారు.

## అమరజవాన్లను స్మరించుకోవాలి

శిరివెళ్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను అర్పిం చిన అమరవీర జవాన్‌లను స్మరించుకోవాలని ప్రైవేటు పాఠశాలల నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించి నేటికి 26 సంవత్సరాలైన సందర్భంగా శిరివెళ్లలోని ఇఖ్రా పాఠశాలలో కార్గిల్ విజయ్‌దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఖ్రా పాఠశాల కరస్పాండెంట్ అష్ఫక్ అహ్మద్, డైరెక్టర్ షేక్. సాకిబ్‌పాల్గొన్నారు.

## నేత్రదానం


నేత్రదానం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

బేతంచెర్ల, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని బోయపేటకు చెందిన ఉరవకొండ నాయుడు (65) అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న లైఫ్ యువనేత్ర సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు నేత్రాదానం గురించి అవగా హన కల్పించి కర్నూలు రెడ్‌క్రాస్ టెక్నిషియన్ ప్రదీప్ నేత్రాలను సేక రించారు. కార్యక్రమంలో మృతుడి కుమారుడు మద్దిలేటి స్వామి, కు టుంబ సభ్యులు, లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు పవన్, షేక్షా వలి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

## పోలీసుల సోదాలు

ఆళ్లగడ్డ, జూలై 26(ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు మండలం లోని కొత్తపల్లె గ్రామంలో శనివారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి గ్రామంలో అను మానితులు, నేర చరిత్ర గల వారి ఇండ్లల్లో సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని మూడు ట్రాక్టర్‌లు, ఐదు ద్విచక్రవాహనాలు, 19 మంది పై మోటార్ వెహికల్ చట్టం ఉల్లంఘన పై జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వరప్రసాద్, నగీన, సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బురద దారితో ఇక్కట్లు


బురద రహదారిలోనే వెళ్తున్న విద్యార్థులు

రుద్రవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకంబలూరు గ్రామానికి సుమారు 1.5 కి.మీ దూరంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. పాఠశాలలో 6 నుంచి 10 వరకు 95 మందివిద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. శనివారం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. సైకిలు తొక్కేందుకు కూడా వీలు లేకుండా రహదారి తయారైంది. రహదారికి మరమ్మతులు చేపట్టా లని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని విద్యా ర్థులు ఆరోపిస్తున్నారు.

## కోవెలకుంట్లలో రైలు నిలపాలి


స్టేషన్ ఇన్‌చార్జి గురుచరణ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్లలో ఉన్న స్థానిక రైల్వేస్టేషన్‌లో గుంటూరు - తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు పర్మినెంట్ స్టాపింగ్, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోవెలకుంట్ల ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రైల్వేస్టేషన్ ఇన్‌చా ర్జి గురుచరణ్‌కు వినతిపత్రం అందించారు. ప్రజా సంఘాల నాయకు లు కరీంబాషా, ఎం.సుధాకర్, వడ్డే సుబ్బరాయుడు, అప్పపోగు వెంకట సుబ్బయ్య. రామచంద్రరాజు మాట్లాడుతూ కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌కు వందకు పైగా గ్రామాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తార న్నా రు. గుంటూరు-తిరుపతి రైలును నిలపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైలు నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకొని స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ వెంకటేశ్, నరసింహ, రాముడు, కిరణ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

సంజామల, జులై 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోమల పెద్ద కోనేరు దగ్గర ఉన్న అరుగు మీద శనివారం సుబ్రమణ్యేశ్వరస్వామి (నాగుల) విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. విష్ణుకంటి క్షేత్ర నిర్వాహ కులు కంబగిరిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. విగ్రహాలను కంబగిరి రామ్మోహన్‌స్వామి ఉచితంగా అందజేశారు. స ర్పంచ్ శంకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు శీలా వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, నాగి రెడ్డి, నరసింహమూర్తి, నాగరాజు పూజలు చేశారు.

## కోరం లేక సమావేశం వాయిదా

సంజామల, జులై 26,(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమా వేశం వాయిదా పడింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సభకు ప్రజా ప్రతినిధుల కోరం లేక ఎంపీడీవో సాల్మన్ సభను వాయిదా వేశారు. మండలంలో 11మంది ఎంపీటీసీలు ఉండగా కేవలం ఇద్దరే సభకు హాజరయ్యారు. వసంతాపురం ఎంపీటీసీ లలిత, ఆల్వకొండ ఎంపీటీసీ సుప్రియ మినహాయించి ఎవ్వరూ హాజరు కాకపో వడంతో సభను వాయిదా వేయాల్సిన పరిస్థితి చోటుచేసుకుంది.

## టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం


రఫీక్ అహ్మద్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జూలై 26 :(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త, రియాల్ ఎస్టేట్ వ్యాపారి రఫీక్ అహ్మద్(68) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం మృత దేహం వద్ద నివాళి అర్పించారు. కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, టీడీపీ నాయకులు అల్తాఫ్‌హుసేన్, సద్దాం, హైదర్ పాల్గొన్నారు.

- రఫీక్ అహ్మద్ మృతిపై టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ శని వారం సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ఇందిరమ్మ ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు అల్తాఫ్‌హుసేన్, హైదర్ తదితరులు ఉన్నారు.

### టీడీపీ కార్యకర్తకు పరామర్శ

పట్టణంలోని కొండపేటకు చెందిన టీడీపీ కార్యకర్త పొగబుడ్డి నజీర్‌హు సేన్‌ను బీసీ రాజారెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల మోటారు సైకిల్ ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యకర్తలు ఖాశీం, హుసేన్‌సా, పవన్‌కుమార్‌యాదవ్, ఫకూర్‌బీ, షఫీ, పిరోజ్ , వెంకటసుబ్బయ్య, గౌం డాభాస్కర్, అమీర్‌ఖాన్, సయ్యద్‌హుసేన్, అహ్మద్‌హుసేన్, లాయర్ రఫి పాల్గొన్నారు.

- టీడీపీ నాయకుడు, ఇల్లూరుకొత్తపేట మాజీ సర్పంచ్ రామిరెడ్డి తల్లి రామలక్షమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీ సుకుంటుండగా మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. ఇల్లూ రు కొత్తపేటకు వెళ్లి ఆమె యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## ఉమ్రా యాత్రకు బయలు దేరిన ముస్లింలు

ఆళ్ళగడ్డ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీలకు చెందిన ముస్లింలు శనివారం ఉమ్రా యాత్రకు బయలు దేరారు. గౌసియా మసీద్ ఇమాం హాజీ నయిముల్లా అల్లాహ్‌తో దువా చేసి యాత్రికులను ఉమ్రా యాత్రకు పంపించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్రా యాత్రను ముస్లిం పెద్దలు అల్లాహ్ కృపతో దిగ్విజయంగా ముగించుకొని తిరిగి రావాలని ఆకాంక్షించారు.